

సమస్యలు పరిష్కరించాలి

కొనసాగిన ఆర్‌టిసి డిపో కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిపో నుండి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత, అక్రమ సస్పెన్షన్ ఆపాలని, గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలని, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు వెంటనే మంజూరు చేయాలని, తదితర సమస్యలపై పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరాహార దీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిపో వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎం.రావు, డిపో ట్రెజరర్ యు.త్రినాథ్, డిపో కమిటీ సభ్యులు ఎం.మహాలక్ష్మి, డి.బుజ్జి, వైఎం.కృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అన్యాయం

- డిప్యూటీ స్పీకర్, అనుచరులు చెప్పేవన్నీ అవాస్తవాలు
- ఎస్ఆర్ నగర్ రండి.. బహిరంగంగా పరిశీలిద్దాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం
- 2న ఎస్ఆర్ నగర్‌లో అఖిలపక్షం పర్యటన
- ఇళ్ల తొలగింపు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలను ఖండించిన రౌండ్‌టేబుల్ సమావేశం
- ఎన్నికల హామీ అమలు చేయకుండా ఉన్న ఇళ్లను కూలుస్తారా
- సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్, పక్కనే రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో ప్రత్యామ్నాయం చూపకుండా నిరుపేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశం విమర్శించింది. ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్లు తొలగిస్తామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఆయన అనుచరులు చెప్పేవన్నీ అవాస్తవాలేనని ఆరోపించింది. పాలకోడేరు ఎస్ఆర్ నగర్ వస్తే బహిరంగంగా పరిశీలించి నిజాలు తేలుద్దాం చేద్దామని సవాల్ విసిరింది. సుమారు వెయ్యి కుటుంబాలు రోడ్డున పడ్డా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎంఎల్‌ఎ కనీసం స్పందించకపోవడం బాధాకరమని అభిప్రాయపడింది. మే 2వ తేదీన ఎస్ఆర్ నగర్‌లో అఖిలపక్షం వెళ్లి సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించాలని నిర్ణయించింది. నియోజకవర్గంలో ఇళ్ల తొలగింపు, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను రౌండ్‌టేబుల్ సమావేశం ముక్తకంఠంతో ఖండించింది. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన ఈ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం మాట్లాడుతూ ఎస్ఆర్ నగర్‌లో పేదలను రోడ్డు పాలు చేస్తున్నారన్నారు. ఎస్ఆర్ నగర్‌లో ఎటువంటి కలుషితమూ లేదని, డిప్యూటీ స్పీకర్, ఆయన అనుచరులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లు కూల్చేసిన నాటి నుంచి తామంతా అక్కడే ఉంటున్నామని, తాము ఆ నీటినే తాగి స్నానాలు కూడా చేశామని తెలిపారు. ఈ ప్రాంతవాసులు కూడా రాజు కలువ నీటిని వంటకు వినియోగిస్తున్నారని చెప్పారు. ఇళ్లు తొలగించిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత అంకెం సీతారాం మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కావాలనే కోరిక ఉంటుందని, పేదలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలిచేది సిపిఎం మాత్రమేనన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ బుల్డోజర్ సంస్కృతిని ఆపి పేదలకు న్యాయం చేయాలన్నారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు ఆహ్వానం పలకగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. రైతుసంఘం నేత బాలం విజయకుమార్, సిపిఐ నాయకులు మల్లుల సీతారాం, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సిపిఎం నేతలు ధనికొండ శ్రీనివాస్, శేషపు అక్కయ్య, గొర్ల రామకృష్ణ, బొక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీ అమలు చేయాలి..★★★

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి



కూటమి ప్రభుత్వం పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి దీనికి భిన్నంగా ఉండిలో ఆరు నెల నుంచి పేద ఇళ్లు తొలగించడం అన్యాయం. సుమారు 800 ఇళ్లు, 200 వ్యాపార సముదాయాలు తొలగించారు. దీనివల్ల పేదలు రూ.40 కోట్లు నష్టపోయారు. ఎస్ఆర్ నగర్‌లో 1986 నుంచి పేదలు నివశిస్తున్నారు. వారంతా పేదలే. ప్రజావసరాల మేరకు ఇళ్లు తొలగించాల్సి వస్తే ప్రత్యామ్నాయం చూపించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. కోర్టు స్టే ఉన్న మూడు ఇళ్లను సైతం తొలగించారు. ఆక్వా ఫుడ్ ఫ్యాక్టరీ కాలుష్యం కోసం పైపులైన్ ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ నగర్‌లో కూడా కాలుష్య నివారణకు పైపులైన్ ఏర్పాటు చేయొచ్చు కదా. పార్టీల కోసం అయితే చేస్తారా, పేదలకు చేయరా. ఇదెక్కడి దారుణం.

ఉండిలో అరాచక పాలన రాజ్యమేలుతుంది..★★★

కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి



ఉండిలో అరాచకాల రాజ్యమేలుతుంది. పేదలకు అండగా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒక ప్రత్యేకమైన హోదాలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. కాలుష్యానికి కారణం ఏంటనేది కాలుష్య నియంత్రణ మండలి చూసుకుంటుంది. గతంలో ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తహశీల్దార్ వనజాక్షిపై దాడి చేస్తే టిడిపి ప్రభుత్వం కుప్పకూలిందనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. సిపిఎం చేస్తున్న న్యాయమైన పోరాటానికి మేము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం.

పేదలకు నష్టం కల్గించేవారిగా క్షత్రియులు ఉండరాదు..★★★

పాతపాటి హరికుమార్‌రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు



క్షత్రియ వంశంలో పుట్టిన రాజులు ఇప్పటివరకు పేదలకు పెట్టే వాళ్లుగా ఉన్నారు తప్ప పేదలకు నష్టం కలిగించే వాళ్లుగా లేరు. పేదల ఇళ్లను తొలగించడంతో వారు ఇబ్బందులు పడుతుంటే క్షత్రియునిగా సిగ్గుపడాల్సి వస్తుంది. కాలుష్యం పేరుతో ఇళ్లు తొలగిస్తామని చెబుతున్నారుగానీ గోదావరి జలాలు పొడుగునా మురుగు సమస్య ఉంది. కాలుష్యం మీద చిత్తశుద్ధి ఉంటే ఆ సమస్య పరిష్కరించాలి. ఇళ్లు తొలగించాలనుకుంటే వేరేచోట్ల ఇల్లు ఇచ్చి ఖాళీ చేయించాలి. సిపిఎం చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు అవగాహన కల్పించి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి, తప్ప కూల్చివేయడం సరైంది కాదు.

కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడింది సిపిఎంనే..★★★

కె.రాజారామ్మోహన్‌రాయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి



రాజ్యాంగబద్ధంగా చట్ట పరిధిలోనే నేను ఇళ్లు కూల్చుతున్నానని బహిరంగంగా చెప్పిన ఎంఎల్‌ఎ కార్మికవర్గ హక్కులు అమలు చేయాలని చట్టం చెబితే ఎందుకు మౌనం వహిస్తున్నారు. నిజంగా పేదలపై ప్రేమ ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపి అప్పుడు ఇళ్లు తొలగించాలి. 2017లో సిపిఎం జిల్లాలో పెద్దఎత్తున కాలుష్యంపై పోరాడింది. 18 పరిశ్రమల నుంచి కాలుష్యం వస్తున్నట్లు ప్రభుత్వం నిర్ధారించింది. అప్పటి కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ రూ.వంద కోట్లు కేటాయించి యనమదుర్రు డ్రెయిన్ ప్రక్షాళన చేస్తామని చెప్పారు. అయితే అమలు కాలేదు. కాలుష్యం పేరుతో పేదల ఇళ్లను తొలగించడం సరైంది కాదు.

రఘురామకృష్ణరాజుకు గుణపాఠం చెప్పాలి..★★★

లంక కృష్ణమూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఉండి నియోజకవర్గం పూర్తిగా కలుషితం కావడానికి బడాబాబుల పరిశ్రమలే తప్ప పేదల ఇళ్లు కాదు అనే విషయం ఉండి ఎంఎల్‌ఎ గుర్తించాలి. 1986 నుంచి ఉంటున్న పేదల ఇళ్లు కూల్చడం దారుణం. పేదల ఇళ్లు కూల్చుతూ, పేదలకు అండగా నిలిచిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. సిపిఎం చేపట్టే భవిష్యత్తు పోరాటాలకు ఫార్వర్డ్ బ్లాక్ అండగా ఉంటుంది.

ఇళ్ల తొలగింపు అన్యాయం..★★★

ఎం.రత్నంరాజు, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి



నియోజకవర్గంలో ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను ఉండి ఎంఎల్‌ఎ బుల్డోజర్లతో కూల్చడం అన్యాయం. పేదలపై విధ్వంసకాండకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో బిఎస్‌పి పూర్తి మద్దతుగా నిలుస్తుంది. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం పనిచేయడం అభినందనీయం. భవిష్యత్తులో జరిగే పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటాం.

లాఠీలకు, తూటాలకు సిపిఎం భయపడదు..★★★

గంటా సుందర్‌కుమార్, దళిత హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు



అతి పేదలైన యానాదుల ఇళ్లకు విద్యుత్ కట్ చేసి ఇళ్లు తొలగించడం దుర్మార్గమైన చర్య. పేదలకు పునరావాసం చూపకుండా ఇళ్లు కూల్చమని ఏ చట్టం చెబుతుందో చెప్పాల్సిన బాధ్యత ఎంఎల్‌ఎపై ఉంది. పేదలకు అండగా నిలిచిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును నిందించడం దుర్మార్గమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సిపిఎం లాఠీలకు, తూటాలకు భయపడే పార్టీ కాదు. సిపిఎం పోరాటానికి మా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం.

సిపిఎంను అవమానించేలా మాట్లాడటం సరికాదు★★★

జి.రాంబాబు, ఎంసిపిఐ జిల్లా నాయకులు



పేదల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అటువంటి పార్టీ, నేతలను అవమానపరిచేలా మాట్లాడడం డిప్యూటీ స్పీకర్ కు తగదు. పేదలకు అండగా నిలబడి వారి సమస్యలపై సిపిఎం చేస్తున్న కృషి అభినందనీయం. సిపిఎం పోరాటాల్లో భాగస్వా ములవుతాం. ఇళ్ల తొలగింపు బాధిత పేదలకు అండగా నిలుస్తాం.

సుప్రీంకోర్టు ఆదేశాలు ధిక్కరిస్తారా..★★★

కోనాల జోసెఫ్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉండి ఎంఎల్‌ఎ దళితులు, పేదలపై రాక్షస పాలన సాగిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న పేదలకు ఎంతోమంది ఎంఎల్‌ఎలు సౌకర్యాలు కల్పించారు. డిప్యూటీ స్పీకర్ మాత్రం పేదలకు సౌకర్యాలు కల్పించడం పోయి ఉన్న గూడును తొలగించే కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగబద్ధంగా పాలన చేయాల్సిన మీరు పేదలపై యుద్ధం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాన్ని కూడా ధిక్కరించి మరీ ఇళ్లను తొలగించడం అన్యాయం.

భూస్వాములు కుట్ర ..★★★

బి.విజయరాజు, సీనియర్ అడ్వకేట్



ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు రాక్షస పాలన సాగిస్తున్నారు. ఎంఎల్‌ఎలు ఎవరైనా పేదలకు ఇళ్లు కట్టిస్తారు. ఇక్కడ మాత్రం తొలగిస్తున్నారు. ఈ చరిత్ర బహుశా ఎక్కడా ఉండదు. పేదలకు ఇబ్బందులు కలిగించి భూస్వాములకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా భూస్వాముల కుట్ర. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేస్తున్న పోరాటం అభినందనీయం.

బుల్డోజర్లతో ఇళ్లు కూల్చడం దుర్మార్గం..★★★

పి.పూర్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి



పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం దుర్మార్గం. అడ్డుకున్న మహిళలను మగ పోలీసులు ఎక్కడపడితే అక్కడ పట్టుకుని గెంటేయడం హేయమైన చర్య. చట్టాన్ని అమలు చేస్తున్నానని చెబుతున్న రఘురామకృష్ణరాజుకు మహిళలను మహిళా పోలీసులే నియంత్రించాలనే విషయం తెలియకపోవడం బాధాకరం. ఈ పోరాటంలో పేదలదే విజయం. దీనికి ఐద్వా అండగా నిలుస్తుంది.

మహిళల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం

కలెక్టర్ నాగరాణి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మహిళా సమాఖ్యలు తయారు చేసే తినుబండారాలు, లేసు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే దిశగా అందమైన ప్రింటింగ్ డిజైన్లతో బాక్స్ ఐటమ్స్‌ను తయారు చేసి అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో డిఆర్‌డిఎ, ఇండస్ట్రీస్ అధికారులు, ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆమె సమావేశమై చర్చించారు. మంచి ఉత్పత్తులు తయారు చేయడం ఎంత ముఖ్యమో, మార్కెటింగ్ చేయడానికి ఆకర్షణయంగా ఉంచడం కూడా అంతే ముఖ్యమన్నారు. మహిళా సమాఖ్య సభ్యులు జిల్లాలో తయారు చేసే పూతరేకులు, చాక్లెట్లు, లేస్ ఉత్పత్తులను అందమైన ప్రింటింగ్ డిజైనింగ్ బాక్సుల్లో ఆకర్షణీయంగా పెట్టి అందించడానికి అనువైన ప్యాకింగ్ ఐటమ్స్‌ను తయారు చేసి అందించాలని ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, లేస్‌పార్క్ మేనేజర్ కుసుమ కుమారి, ఎపిఎంఎలు అమీన్‌ఉన్నిసా, నాయుడు, ప్రింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను తీర్చిదిద్దాలి

పట్టణంలోని శ్మశానవాటికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్లో గునుపూడి, బలుసుమూడి శ్మశాన వాటికల అభివృద్ధి, మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ టాయిలెట్ల నిర్మాణాలపై మున్సిపల్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భీమవరం పట్టణంలోని గునుపూడి శ్మశాన వాటిక అభివృద్ధి పనులను అత్యంత నాణ్యతతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపుదిద్దాలన్నారు. గునుపూడి శ్మశాన వాటిక సుమారు 1.9 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీని అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలు మంజూరు చేసి, వివిధ పనులకు టెండర్లు పిలిచి పూర్తి చేశామని, త్వరలోనే పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త బస్టాండ్ ఔట్‌గేట్ పక్కనే పింక్ టాయిలెట్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి పట్టణంలో మహిళల ప్రత్యేక అవసరాల కోసం పింకు టాయిలెట్ల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఎ.అప్పారావు, మున్సిపల్ ఇంజినీర్ టి.త్రినాధరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

కాళ్ల: ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే దిశగా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పెదఅమిరంలో యూత్ క్లబ్ రోడ్ సాయిబాబా గుడి శివారు ప్రాంతంలోని వివిధ లేఅవుట్‌లకు నిబంధనల ప్రకారం వదిలిన 10 శాతం ఖాళీ స్థలాలను ఆమె మంగళవారం పరిశీలించారు. గ్రామ సర్వేయర్ కిషోర్ ఏఏ ప్రాంతాల్లో ఎంతెంత విస్తీర్ణం ఖాళీ స్థలాలు ఉన్నాయో కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన మండలాల్లో కూడా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ప్రజలకు ఉపయోగపడే పార్కులు, వాకింగ్ ట్రాక్స్, ఆట స్థలాలు, తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపిడిఒ డాక్టర్ బి.స్వాతి, ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, గ్రామ సర్వేయర్ కిషోర్, సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సిపిఎం చలివేంద్ర శిబిరం ధ్వంసం

గుర్తు తెలియని ఆగంతకులు దుశ్చర్య

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజల దాహార్తి తీర్చేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం శిబిరాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సిపిఎం కొణితివాడ, నవుడూరు గ్రామ శాఖల ఆధ్వర్యంలో వీరవాసరం-నవుడూరు ఆర్అండ్‌బి మార్గంలో అమరజీవి కలిదిండి సూర్యనారాయణరాజు పేరుతో 14 రోజులుగా దాతల సహకారంతో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ముందు నుండి కొంతమంది ఇక్కడ చలివేంద్ర శిబిరం ఏర్పాటుపై అభ్యంతరం తెలిపారు. చలివేంద్ర శిబిరం తాత్కాలికమేనని, శాశ్వత నిర్మాణాలు చేపట్టే ఆలోచన లేదని సిపిఎం నేతలు స్పష్టం చేశారు. అయితే గుర్తుతెలియని ఆగంతకులు శిబిరం ధ్వంసం చేయడంపై సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, లింగం సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దాహార్తి తీరుస్తుంటే వీరికి వచ్చిన అడ్డం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. అనేక మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించడంతో ప్రతిరోజూ వందల మంది ఎండ వేడిమి తట్టుకోలేక ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, రైతులు, రైతుకూలీలు శిబిరం వద్ద దాహార్తి తీర్చుకుంటున్నారన్నారు. అటువంటి శిబిరాన్ని ధ్వంసం చేయడం మానవత్వం లేని వారి పనేనన్నారు. ఇదే సంఘటనలు పునరావృతమై తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



నవుడూరు - వీరవాసరం ఆర్ అండ్ బి మార్గంలో ధ్వంసమైన చలివేంద్రం

మానసిక ఆసుపత్రుల సందర్శన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ స్థానిక మానసిక వైద్యశాలలు శాంతి నర్సింగ్ హోమ్, ప్రశాంతి నర్సింగ్ హోమ్, వర్మ హాస్పిటళ్లను మంగళవారం సందర్శించి మానసిక రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల గదులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి, వారి మానసిక స్థితి గురించి వైద్యులను ఆరా తీశారు. అత్యవసర చికిత్సా విభాగాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాంతి మానసిక వైద్యశాల డాక్టర్ జివి.రమణారావు, ప్రశాంతి మానసిక వైద్యశాల డాక్టర్ మాదిరెడ్డి వెంకటరమణ, వర్మ హాస్పిటల్స్ మానసిక వైద్యురాలు శ్రీదేవి, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

బస్సు కండక్టరు, లారీ డ్రైవర్‌తోసహా ఏడుగురికి గాయాలు

రోడ్డు మార్జిన్, తుప్పలతో నిత్యం ఇక్కడ ప్రమాదాలు




బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాడేపల్లిగూడెం నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్న ఆర్‌టిసి బస్సును నంద్యాల నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న సిమెంటు లారీ బాదంపూడి శివార్లలో జాతీయ రహదారికి సమీపంలో మలుపు వద్ద మంగళవారం ఉదయం ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, బస్సు కండక్టర్‌తో పాటు మరో ఐదుగురు గాయాల పాలయ్యా రు. బస్సు డ్రైవర్ పిఎన్.వెంకటేష్ కథనం మేరకు తాడేపల్లిగూడెంలో 22 మంది ప్రయాణికులతో ద్వారకాతి రుమల బస్సు బయల్దేరింది. ఈ బస్సు సరిగ్గా బాదంపూడి శివార్లలో జాతీయ రహదారి వై-జంక్షన్ సమీపంలో మలుపు తిరుగుతుండగా జాతీయ రహదారి వై-జంక్షన్ నుంచి తాడేపల్లిగూడెం వైపు సిమెంటు లారీ అతి వేగంగా దూసుకొచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ బస్సును కాల్వ గట్టు వైపు మార్జిన్‌లోకి మళ్లించినా సిమెంటు లారీ బస్సును ఢీకొట్టి ముందుకు దూసుకెళ్లింది. దీంతో బస్సు ఒక్కసారిగా తీవ్ర కుదుపులకు లోనై ప్రయాణికులు ఒకరిపై మరొకరు పడిపోయారు. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ సిహెచ్.వెంకటరమ ణతోపాటు ప్రయాణికులు రౌతు సరోజ, ఇ.మేఘన, కర్రి వికాస్, ఆర్.తేజస్విని, పావని స్వల్పంగా గాయపడ్డారు. 108 అంబులెన్సులో వీరిని తాడేపల్లిగూడెం తరలించారు. సిమెంటు లారీ డ్రైవర్ చవల రమేష్ తలకు గాయమైంది. బస్సు కండక్టర్, లారీ డ్రైవర్ తాడేపల్లిగూడెం ప్రభుత్వాసు పత్రిలో చికిత్స పొందుతుండగా గాయాల పాలైన ప్రయాణికులు ప్రయివేటు ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. సిమెంటు లారీ డ్రైవర్‌కు లైసెన్స్ కూడా లేదని సమాచారం. ప్రమాదం కారణంగా కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పలు వాహనాలు బాదంపూడి ఊళ్లోంచి హైవే మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చేబ్రోలు పోలీసులు, హైవే రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆర్‌టిసి అధికారులు మిగిలిన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు పంపించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెం: బాదంపూడి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన బస్సు కండక్టర్ సిహెచ్.వెంకటరమణ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సును లారీ ఢీకొనగా నే తాను ఒక్కసారిగా సీట్లోంచి కింద పడిపోయానని, దీంతో తలకు, కాలికి గాయాలయ్యాయని చెప్పారు.



కూటమి సర్కార్ కౌలురైతులను తీవ్రంగా వంచిస్తోంది. తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తెచ్చి న్యాయం చేస్తామని చెప్పిన నాయకులు ఏడాది గడిచినా చట్టం తీసుకురాని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడిచిన ఖరీఫ్, రబీ సీజన్లలో కౌలురైతులకు అరకొర కౌలుకార్డులు, రుణాలతో సరిపెట్టి మమ అన్పించారు. తాము పండించిన ధాన్యం సైతం తమ పేరున అమ్ముకోలేని దుస్థితిలో కౌలురైతులు ఉన్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ఈ ఏడాదైనా తమకు న్యాయం చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

'కౌలు' ఘోష పట్టదా..!

- కూటమి సర్కార్‌లో కౌలురైతులకు దక్కని ఊరట
- ఏడాది గడిచినా కొత్త చట్టం ఊసే కరువు
- అరకొర కౌలుకార్డులు, పంట రుణాలతో మమ
- పండించిన ధాన్యం సైతం తమ పేరున అమ్ముకోలేని దుస్థితి
- అన్నదాత సుఖీభవ కౌలురైతులకు దక్కేనా
- ఏలూరు, పశ్చిమలో మూడు లక్షల మంది కౌలురైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. రెండు జిల్లాల్లోని వ్యవసాయ సాగులో 80 శాతం వరకూ కౌలురైతులే చేస్తున్నారు. కౌలురైతులు లేకపోతే సాగు ప్రశ్నార్థకంగా మారనుంది. అటువంటి కౌలురైతుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2019లో వైసిపి సర్కార్ తెచ్చిన కౌలుచట్టంతో భూయజమాని అంగీకారం లేకుండా కౌలుకార్డులు ఇచ్చే అవకాశం లేదు. వైసిపి సర్కార్ తెచ్చిన చట్టం కౌలురైతులకు ఉరితాడుగా మారింది. దీంతో కౌలురైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తెస్తామని కూటమినేతలు తెలిపారు. కౌలురైతులకు న్యాయం చేస్తామంటూ ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అప్పట్లో అనేక సభల్లో చెప్పారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే కౌలురైతుల కొత్తచట్టంపై పెద్దఎత్తున హడావుడి చేశారు. పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరిట సమావేశాలు సైతం నిర్వహించారు. అంతలోనే అర్థాంతరంగా అన్ని పనులూ నిలిపివేశారు. కూటమి సర్కార్ వచ్చి ఏడాది గడిచినా ఇప్పటి వరకూ కొత్త చట్టం తీసుకురాలేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కౌలురైతులకు కౌలుకార్డులు అరకొరగా జారీ చేసి తూతూమంత్రంగా పంట రుణాలిచ్చి సరిపెట్టిన పరిస్థితి ఉంది.

ఈ ఏడాదైనా న్యాయం చేస్తారా..?

గత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 62,647 మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా జారీ చేసిన కార్డులు మాత్రం 52,059 మాత్రమే. కార్డులు పొందిన రైతుల్లో 23 వేల మందికి రూ.142.85 కోట్లు మాత్రమే పంటరుణాలు ఇచ్చారు. పశ్చిమలో 1,08,330 కౌలుకార్డుల జారీ లక్ష్యం పెట్టుకోగా 85,125 కార్డులు జారీ చేశారు. ఇచ్చిన రుణం 24 వేల మందికి రూ.235 కోట్లు మాత్రమే. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో ఈ రుణాల మంజూరు ఒక్కశాతం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. జూన్ నుంచి ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతోంది. అన్నదాత సుఖీభవ సొమ్ము సాగు చేసే రైతులకు మాత్రమే ఇచ్చే పెట్టుబడి సాయం. భూయజమానికి కాకుండా కౌలు రైతులకు మాత్రమే ఈ సొమ్ము అందించాలి. ఆ విధంగా చేయాలంటే కౌలుకార్డుల జారీ ప్రక్రియ పక్కాగా జరగాలి. కొత్త చట్టం తీసుకు రాలేదు. మరి ఏవిధంగా కౌలురైతులను గుర్తించి పెట్టుబడి సాయం అందిస్తారో ప్రభుత్వం చెప్పాలి. అలాకాకుండా వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కౌలురైతులకు అన్యాయం చేస్తుందో వేచిచూడాలి. కౌలుకార్డులు పక్కాగా జారీ చేసి పంటరుణాలు అందించినప్పుడు కౌలురైతులకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం అటువైపు ఆలోచిస్తున్నట్లు ఏమాత్రం కన్పించడం లేదు. అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కౌలురైతుల ఆగ్రహం చవిచూడక తప్పదని చెప్పొచ్చు.

సబ్‌జైలులో తనిఖీలు

ప్రజాశక్తి - నరసాపురం



మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.రత్న ప్రసాద్ మంగళవారం నరసాపురం ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ ముద్దాయిలతో మాట్లాడుతూ క్రమం తప్పకుండా వాయిదాకు కోర్టులో హాజరు పరుస్తున్నారా, తదుపరి వాయిదా తేదీ తెలుపుతున్నారా లేదా, అనారోగ్యంగా ఉన్నవారికి వైద్య సదుపాయం కల్పిస్తునారా లేదా అని జైల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. నిందితుల కేసుల వివరాలు, ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు పరిశీలించారు. శిక్షపడిన వారు ఆర్థిక స్తోమత లేనివారు అప్పీల్ చేసుకునేందుకు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు శిరీష, ఛాముండేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించినట్లు పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణ రాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ఎస్‌సి మార్క్ మెమో, టిసి, ఆధార్, స్టడీ కుల ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు జతపర్చి మే 24వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రభుత్వ ఐటిఐ ఆచంట కాలేజీలో అందజేయాలని కోరారు. ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఆర్ అండ్ ఎసి మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్స్ మెన్ సివిల్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల కాల వ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఆచంట పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సత్యనారాయణ రాజు కోరారు.

తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి ఇంటి నుంచీ తడి, పొడి చెత్త వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందించే అలవాటు చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ సూచించారు. మండలంలోని జగ్గన్నపేటలో మంగళవారం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ఇంటింటికీ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం ద్వారా తడి చెత్తను కంపోస్ట్ చేసి పొడి చెత్తతో సంపద సృష్టించవచ్చని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య సిబ్బందికి కీలక బాధ్యత అని, వారు నూరు శాతం గ్రామాల్లో అవగాహన కల్పిస్తే ఆ గ్రామం అంతా చెత్త రహిత గ్రామంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్‌బాబు అన్నారు. మండలంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తరుణంలో ఎండలో పనిచేస్తున్న కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉదయం 11 గంటలకల్లా పనిని నిలుపుదల చేయాలని సూచించారు. కూలీలకు కావాల్సిన ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉపాధి హామీ పనుల సూపర్వైజర్ కొండ్రు తాతయ్యకు అందజేశారు. వారిని కూలీలకు అందజేసి వారికి వడదెబ్బ తగులకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా కొడమంచిలి వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య రామాలయం వద్ద మంగళవారం మజ్జిగ చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ ఆచంట గోల్డ్ ప్రెసిడెంట్ బాలనాగు రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చలివేంద్రంలో ప్రతిరోజూ చల్లటి తాగునీటితో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. 1990 నుంచి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాదచారులు, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బాలనాగు శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు కొల్లేపర వెంకన్నబాబు, బాలనాగు పెదబాబు, కాజా సత్యనారాయణ, కొల్లిపర సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డిలో ప్రాంగణ ఎంపికలు

194 మంది విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి - తణుకు


ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) తణుకులో కేరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ విభాగం వారు ప్రాంగణ ఎంపికలు కళాశాలలో నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికల్లో 5 కంపెనీలైన టెక్ మహీంద్ర, క్లౌడ్‌బాక్స్-99, సారస్ఇన్ఫో, కార్వవన్, లక్స్‌షేర్-హైదరాబాద్ పాల్గొన్నట్లు తెలిపారు. 194 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరికి వార్షికాదాయం సుమారు రూ.2 లక్షల 40 వేలు అని, ఎంపికైనవారు హైదరాబాద్‌లో మే నుండి విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.హరిప్రసాద్, సభ్యులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

ఉండి: ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం లభిస్తుందని ప్రకృతి వ్యవసాయం ఉండి డివిజన్ ఇన్‌ఛార్జి మహేష్ అన్నారు. మంగళవారం పెదపుల్లేరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ ఎరువులు వాడడం వల్ల భూసారం కోల్పోయి నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువుల వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందొచ్చన్నారు. అనంతరం టిడిపి గ్రామ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు (సత్తిబాబు), ఎంపిటిసి రాయి రావులమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎవరికి వారు కాకుండా ఉమ్మడిగా నిర్వహించినట్లయితే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రమణమ్మ, మండల ఇన్‌ఛార్జి ఎం.దుర్గ, సిబ్బంది అంగర శ్రీను, రాజేశ్వరి, శ్రావణ దుర్గ, గణేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

పాలకోడేరు: ఉండి నియోజకవర్గాన్ని డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షం, వామ పక్షాలు అడ్డుకోవడం మానుకోవాలని కుమదవల్లి గ్రామ సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు చేస్తున్న అభివృద్ధికి మద్దతు ప్రకటించి, ఆయనపై చేస్తున్న ఆరోపణలు ఖండించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎఎస్ఆర్.నగర్‌లో ఆక్రమణల వల్ల కాలువ కలుషితమవుతోందని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఎంఎల్ఎ కాలువ ప్రక్షాళన పనులు చేపట్టారని తెలిపారు. అనంతరం గ్రామస్తులు రాజుల కాలువను ప్రక్షాళన చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, నాగేంద్ర వర్మ, సత్యనారాయణ రాజు, రమేష్ రాజు, రమణ, శంకర రెడ్డి, ఎర్రయ్య, పాండురంగరాజు, నవీన్, బాబ్జి రాజు, దాసయ్య, వెంకన్న, ఏసు, సత్యానందం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

విద్యార్థులు ఏ కోర్సులు చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చో అటువంటి కోర్సులను ఎంపిక చేసుకోవాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. మంగళవారం తణుకు గమిని ఫంక్షన్ హాల్లో తణుకు మండల పరిధిలోని 40 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోని పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 80 మంది విద్యార్థులను తణుకు మానవత ఆధ్వర్యంలో సత్కరించారు. దాత చిట్టూరి సుజాత రాంప్రసాద్ స్పాన్సర్ చేసిన ప్రోత్సాహక బహుమతులను ఎంఎల్ఎ ప్రదానం చేశారు. అనంతరం మానవత డైరెక్టరీని ఆవిష్కరించారు. చిట్టూరి సుజాత స్పాన్సర్ చేయబడిన రూ.10 వేలు కొంగరపు నందీశ్వరికి వివాహ ఖర్చుల నిమిత్తం, ఇటీవల ఒక ప్రమాదంలో కాలు కోల్పోయిన ఎల్లమల్లి ధనలక్ష్మికి మరో రూ.10 వేలు రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ 2004లో 108 సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంస్థలో లక్ష మందికి పైగా సభ్యులు ఉన్నారని, ఎంతో మంది దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ కోడూరి రాధాపుష్పావతి మాట్లాడారు. కార్యక్రమంలో కడింజెర్ల రాజరాజేశ్వరరావు, బోయపాటి రామలక్ష్మి, ఎస్‌వి.సతీష్‌బాబు, వివి.రామకృష్ణ, ఆనందం మస్తాన్‌రావు, అక్కపంతుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపుల్లేరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండి

మారుమూల గ్రామాల ప్రజలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్న వికాస్ ప్రాథమిక కంటి ఆసుపత్రి సేవలు ఎనలేనివని పెదపుల్లేరు గ్రామ టిడిపి అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు (సత్తిబాబు) అన్నారు. మంగళవారం పెద్దపుల్లేరు గ్రామంలో వికాస్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు యండమూరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో నడింపల్లి సత్యనారాయణ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆపరేషన్ అవసరమైన వారికి ఏలూరులోని శంకర్ ఆసుపత్రి సమన్వయంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం డాక్టర్ యండమూరి ప్రభుదాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్నారులకు సైతం దృష్టిలోపం సాధారణమైపోయిందని, ప్రారంభ దశలోనే దృష్టిలోపాలను తెలుసుకుంటే వాటిని నివారించవచ్చని సూచించారు. శిబిరంలో సుమారు 80 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారిలో సుమారు పది మందికి ఆపరేషన్ అవసరమైందని, మిగిలిన వారికి కళ్ల జోళ్లు, మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వికాస్ ప్రాథమిక కంటి ఆసుపత్రి అండ్ ఆప్టికల్స్ సిబ్బంది వై.కరుణకుమారి, కె.మేరీ దీవెన, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

తాడేపల్లిగూడెం, చింతలపూడి: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక గొల్లగూడెం సెంటర్లో సాంఘిక సంక్షేమ శాఖ గర్ల్స్ హాస్టల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పాత చింతలపూడి గ్రామానికి చెందిన కె.తేజస్విని (21) తాడేపల్లిగూడెం మదర్ వన్నీ నర్సింగ్ కళాశాలలో బిఎస్‌సి నర్సింగ్ ఫైనలియర్ చదువుతుంది. స్థానికులు, సహచర విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్నం తాము రూమ్‌కు వెళ్లేసరికి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుందన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయగా రూరల్ ఎస్ఐ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తేజస్విని ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. త్వరలోనే నర్సింగ్ విద్య పూర్తి చేసుకుని ఉద్యోగం చేస్తానని చెప్పిన తేజస్విని విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేత

వీరవాసరం: పెర్కిపాలెం గ్రామంలో ఈ నెల 27న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుకు అలంల వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎంపిటి వీరవల్లి దుర్గా భవానీ చంద్రశేఖర్, స్థానిక నాయకుల ఆర్థిక సహకారంతో మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ప్రభుత్వం అందజేసే ఐదు వేల రూపాయలను వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని విఆర్ఒ రవి వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలను ఎంపిటి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి గెద్దాడ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సేవకు చిరునామా డాక్టర్ జానకమ్మ

ఆకివీడు: పేదలకు సేవా దృక్పథంతో వైద్య సేవలందించి వచ్చి పట్ల అంకితభావంతో పనిచేసిన డాక్టర్ కె.జానకమ్మ ధన్యజీవి అని వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ కె.జానకమ్మ సంస్మరణార్థం ఆకివీడు సెంటర్ లయన్స్ క్లబ్ హాల్లో మంగళవారం లయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిర నిర్వహించారు. ఈ శిబిరం ప్రారంభం సందర్భంగా జానకీ లయన్స్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి లర్పించారు. అనంతరం శిబిరాన్ని లయన్స్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ డి.సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎంవి.సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. అనంతరం శిబిరంలో 8 రకాల వ్యాధుల ప్రత్యేక నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 324 మందికి వైద్య సేవలందించినట్లు తెలిపారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో నరసాపురం మున్సిపాల్టీ ఉన్నత స్థానం సాధించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 14వ వార్డు డంపింగ్ యార్డ్‌ను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ స్థానం సాధించేలా అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వాటర్ పాయింట్స్, ఇంటింటా చెత్త సేకరణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు శానిటరీ మేస్త్రి కిషోర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలి : డిపిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో పంచాయతీ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ ఆదేశించారు. మంగళవారం ఆమె మొగల్తూరులో పర్యటించారు. గ్రామంలోని మన వర్మి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మొగల్తూరులో పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది పారిశుధ్య కార్మికులతో సమీక్షించారు. పారిశుధ్య కార్మికుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అవసరమైతే సిబ్బందిని పెంచాలని, ఎక్కువ మంది సెలవు తీసుకోకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావుకు సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, హేమ సాయిబాబు, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపును అరికట్టాలి

టిడిపి నాయకుల ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు



ఆందోళన చేస్తున్న నేతలు

మొగల్తూరులోని జాతీయ రహదారి పక్కన ఉన్న వక్ఫ్ బోర్డు స్థలంలో మట్టిని అక్రమంగా తరలించుకుపోవడంపై మంగళవారం టిడిపి నాయకులు ఆందోళన చేశారు. అక్రమంగా మట్టి తరలింపును అరికట్టాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ కె.రాజుకిషోర్ ఆ ప్రాంతానికి విఆర్ఒను పంపి మట్టి రవాణా నిలుపుదల చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు బొల్లా చంటి, కౌర్ నాగేశ్వరరావు, డొల్ల రత్నం రాజు, వెలిది పుల్లారావు పాల్గొన్నారు.

మేడే సభలో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొనాలి

ప్రజాశక్తి - భీమవరం



తణుకు : మేడే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

మే 1న జరిగే మేడే సభలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేడే పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులు నేడు మోడీ ప్రభుత్వం రద్దు చేస్తోందన్నారు. ఇటీవల పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, కె.సోమేశ్వరరావు, కొండయ్య, సోమన్న, ఆదినారాయణ, సత్యనారాయణ, శివ పాల్గొన్నారు.

తణుకు: మేడే రోజున లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామని కార్మికులు ప్రతినభూనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక వాన్‌బరి ఫ్యాక్టరీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పహల్గాం బాధితులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో ఏర్పడిన రాజ్యాంగం మోడీ పాలనలో ధ్వంసం అవుతోందని విమర్శించారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు మోడీ నాశనం చేస్తున్నారన్నారు. మోడీ విధానాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉండడం వల్లే మే 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, గుబ్బల గోపి, ఆదినారాయణబాబు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, అచ్చియ్య, రామకృష్ణ, సాయిబాబా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : సారంలేని లేబర్ కోడ్‌లను కార్మికవర్గంపై రుద్దాలని చూస్తున్న బిజెపి విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులు మేడేను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పిప్పరలో అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు కాటుక ఝాన్సీ, సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారిత్రాత్మక మేడేను జయప్రదం చేయాలని కోరారు. అమరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని మోడీ ప్రభుత్వం హరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, అనిత, కృష్ణవేణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'రష్మి' ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ

డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 2025 ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు రష్మి ప్రతిభా పురస్కారం -2025' పేరిట నగదును ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఇఒ ఇ.నారాయణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిఇఒ మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో పదో తరగతి చదివి నేడు అమెరికాలో స్థిరపడిన ముదునూరి పాండురంగరాజు ఏకైక కుమార్తె రష్మి పేరిట విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో సుమారు 12,000 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి 10వ తరగతి పరీక్షలు రాస్తే 1400 మందికిపైగా 500 మార్కులు దాటాయని తెలిపారు. అనంతం పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు గెడ్డం అభినయ్ (542 మార్కులు), రావూరి మహిమ తేజ స్వీటీ (528 మార్కులు), యర్రంశెట్టి విజయ మహంకాళమ్మ (515 మార్కులు)కు వరుసగా రూ.10,000, రూ.7,500, రూ.5,000 డిఇఒ అందజేశారు. ఈ కార్యక్రమానికి అనుసంధానకర్త, పాఠశాల ప్రథమ సహాయకులు రేపాక వెంకన్న బాబు మాట్లాడారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ సుంకర పరమేశ్వరరావు నగదు పురస్కారాన్ని అందించిన ముదునూరి పాండురంగరాజు పద్మావతి దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందినా పాఠశాలకు తమ సేవలందిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లును, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వంటా బత్తిన మెర్సి నిర్మలా కుమారిని డిఇఒ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎం.వెంకటేశ్వరరావు, ముదునూరి సూర్యనారాయణ రాజు, మాజీ సర్పంచి వనిమ రుద్ర భాస్కరరావు, ప్రధానోపాధ్యాయిని రాధామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



తాడేపల్లిగూడెం: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం గ్రంథాలయంలో మంగళవారం రెండో రోజు వేసవి శిక్షణ తరగతులకు 35 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంపొందించే అనేక పుస్తకాలు ఉన్నాయన్నారు. పట్టణంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలన్నారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకూ జరిగే శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థీ వినియోగించుకోవాలని కోరారు. గరికపాటి బాపయ శర్మ, ప్రత్తి వీరాస్వామి, ఆర్.నాగేంద్రకుమార్, ఎ.జనార్దన్‌రావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రతి రోజూ పుస్తక పఠనం చేయడం వల్ల పిల్లల్లో జ్ఞానం వికసిస్తుందని విశ్రాంత ఉపాధ్యాయిని పి.సువర్ణ గౌరి తెలిపారు. మంగళవారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొని పిల్లలతో చదవడం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఇంగ్లీష్‌లో కథలు చెప్పి, వారి చేత చెప్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎం.సాజన్య, కె.సాయి సుదీప్తి, టి.ధీరజ్, కె.ఝాన్సీ తదితరులకు గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ బహుమతులు అందించారు.

కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి - కాళ్ల

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఎంపిడిఒ జి.స్వాతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం గ్రామస్థాయి కమిటీ సభ్యులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్లు నిర్మల, హేమలత మాట్లాడుతూ మే 2న కిశోరి వికాసం ప్రారంభమై జూన్ 10వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. వారంలో రెండు రోజులు గ్రామంలోని ఉన్న బాలికలందరూ హాజరుకావాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ మాట్లాడుతూ కిశోర బాలికలు వారీ హక్కులు, రక్షణ, విద్య, ఆరోగ్యం, న్యూట్రిషన్, ఆర్థిక సావలంబన వంటి అంశాలపై అవగాహన కల్పించేలా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. సమావేశంలో అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తణుకు : ఐసిడిఎస్ ప్రాజెక్టు తణుకు పరిధిలోని తణుకు మున్సిపాల్టీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకూ ప్రతి మంగళ, శుక్రవారం 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. వారికి శారీరక మార్పులు, హైజీన్, లింగవివక్షత, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతరాణి, ఎంఎస్‌కె మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి వికాసం కమిటీ సభ్యులకు సూచించారు.

'వైసిపి బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు పట్టణ అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన కోరాడ శ్రీనివాస్, యలమంచిలి మండల అధ్యక్షుడుగా నియమితులైన ఉచ్చుల స్టాలిన్ మంగళవారం శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి తీవ్రంగా కృషి చేయాలని ఎంఎల్‌సి వారిని కోరారు. ఆయనను కలిసిన వారిలో వైసిపి నేతలు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కాళ్ల

అభివృద్ధి విషయంలో ప్రతీదీ ప్రభుత్వంపై ఆధారపడకుండా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆయన స్నేహితులు, దాతల సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని టిడిపి నాయకులు తెలిపారు. పెదఅమిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పంట కాలువల పక్కన ఉన్న ఇళ్లను తొలగిస్తున్నారని, ఇళ్లు తొలగించిన వారికి వేరే చోట ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టుకునేందుకు కూడా నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారని తెలిపారు. సమావేశంలో ఆకివీడు డీసీ ఛైర్మన్ గోకరాజు వెంకట శివరామరాజు, ఎంపిపి పెన్మెత్స విశ్వనాధరాజు, ఎమ్‌డి.అజ్మల్, ఎమ్‌డి.జాకీర్ పాల్గొన్నారు.

'డిప్యూటీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ప్రజాశక్తి - ఆకివీడు

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుపై సిపిఎం నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదని టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక టిడిపి మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అభివృద్ధే లక్ష్యంగా రఘురామకృష్ణరాజు పనిచేస్తున్నారన్నారు. పేదల అభివృద్ధి అంటూ ఆ అభివృద్ధిని వారు అడ్డుకుంటున్నారన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన బొల్లా వెంకట్రావు, టిడిపి వాణిజ్యభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంట్ల గణపతి పాల్గొన్నారు.